## పంటల కొనుగోలు దుకాణాలు తనిఖీ

పత్తి లోడింగ్ చేస్తున్న వాహనం, పంటను పరిశీలిస్తున్న ఉట్నూర్ సబ్ కలెక్టర్ యురాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలివ్యా

ఇంద్రవెల్లి, నవంబర్ 20 : మండల కేంద్రంలో పత్తి, సోయాబీన్ కొనుగోలు చేస్తున్న దుకాణాలను ఉట్నూర్ సబ్ కలెక్టర్ యురాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలివ్యాతో కలిసి బుధవారం తనిఖీ చేశారు. కాగితపు బుక్‌లో రాసిన కొనుగోలు వివరాలను పరిశీలించారు. పత్తి పంటతో పాటు సోయాబీన్ క్వింటాల్ ధర ఎంత చెల్లిస్తున్నారని వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన పంటలు ఎక్కడికి తీసుకెళ్లి అమ్ముకుంటారు అనేది వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు తమ దుకాణాల ముందు పత్తి నింపుతున్న వాహనాలను పరిశీలించి దానిపై ఉట్నూర్ సబ్ కలెక్టర్ యురాజ్ మర్మాట్, శిక్షణ కలెక్టర్ అభిజ్ఞాన్ మాలివ్యాలు చర్చించుకున్నారు. వారి వెంట రెవెన్యూ శాఖ అధికారులు ఉన్నారు.

**అధికారులు వస్తున్నట్లు వ్యాపారులకు ముందస్తు సమాచారం**

దుకాణాల తనిఖీ కోసం అధికారులు వస్తున్నట్లు ముందస్తు సమాచారం అందుకున్న పలువురు వ్యాపారులు పంటలతో లోడింగ్ చేసిన వాహనాలను సైతం దుకాణాల ముందు నుంచి ఇతర ప్రాంతాలకు తరలించారు. మండలంలోని వ్యాపారులతో పాటు దళారులు పంటలను కొనుగోలు చేయకుండా దుకాణాల్లో ఖాళీగా కుర్చున్నారు. దీంతో దళారులతో పాటు వ్యాపారులపై రైతులు, ప్రజలు అనేక రకాల అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# కదిలిన యంత్రాంగం

న్యూ లోలం కొనుగోలు కేంద్రంలో తూకం వేసి లారీలో కోసం ఉంచిన ధాన్యం బస్తాలు

**కుప్పలు.. తెప్పలు**

**లారీలు రాకపోవడంతో కేంద్రాల్లోనే ధాన్యం**

దిలావర్‌పూర్, నవంబర్ 20, నమస్తే తెలంగాణ : కుప్పలు తెప్పలుగా ధాన్యం నిండుగా ఉన్నాయి. మరికొన్ని కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన తర్వాత లారీలు రాకపోవడంతో ధాన్యపు రాశులు కుప్పలుగా పేరుకుపోయాయి. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించి, వారికి అండగా నిలుస్తామని మొదటి ఆరోగారంలోనే చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుకు నష్టం మాత్రం మిగులుతుందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు ఇబ్బందులు లేకుండా మాశాలని కోరుతున్నారు.

నమస్తే తెలంగాణలో ప్రచురించిన కథనం

## ధాన్యం తరలింపు

దిలావర్‌పూర్, నవంబర్ 20: 'కుప్పలు తెప్పలు' అనే శీర్షికతో సోమవారం 'నమస్తే తెలంగాణ'తో ప్రచురితమైన కథనానికి కలెక్టర్ అభిలాష అభినవ్ స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు బుధవారం డీఎస్‌వో కిరణ్‌కుమార్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. తూకం వేసిన ధాన్యాన్ని లారీల్లో కేటాయించిన రైస్‌మిల్లులకు తరలించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. నిర్మల్ రైతు సేవ సహకార సంఘం ఆధ్వర్యంలో న్యూ లోలంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని లారీల్లో తరలించారు.

న్యూ లోలం కొనుగోలు కేంద్రం నుంచి ధాన్యాన్ని తరలిస్తున్న అధికారులు

## రూ.5.30 కోట్లతో ప్రతిపాదనలు

**నమస్తే ఎఫెక్ట్**

- బ్రిడ్జి నిర్మాణానికి పంచాయతీరాజ్ ప్రతిపాదనలు
- వరుస కథనాలతో స్పందించిన కలెక్టర్, అధికారులు
- కూలిన వారధిని సందర్శించిన యంత్రాంగం

కుంటాల, నవంబర్ 20 : కల్లూరు-నర్సాపూర్(జీ) గ్రామాల మధ్య 30 ఏండ్ల క్రితం నిర్మించిన వంతెన కూలిపోవడంతో ప్రజలు, రైతులు పడుతున్న ఇబ్బందులను 'నమస్తే తెలంగాణ' ప్రచురించింది. ఈ నెల 14వ తేదీన 'వాగు దాటాలంటే తెప్పే ఆధారం' 18వ తేదీన 'ప్రమాదమని తెలిసినా... పైపు మీద పొలానికి..' అనే శీర్షికలతో కథనాలను ప్రచురించింది. దీంతో బుధవారం జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఇచ్చిన వివరణ ప్రకారం రూ.5.30 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు పంపినట్టు రాతపూర్వకంగా తెలిపారు. కాగా.. కలెక్టర్ అభిలాష అభినవ్ 'ఎక్స్'లో ఒక ఆంగ్ల డిజిటల్ మీడియా సంస్థ పోస్టుకు బదులు ఇచ్చారు. ఇదీ ఒక పునరావాస గ్రామమని, వర్షాలు వరదలకు బ్రిడ్జి దెబ్బతిన్నదని, మరమ్మతు అనుమతుల కోసం ప్రతిపాదనలు ముందే పంపామని పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణలో ప్రచురించిన కథనం

**వంతెన దాటడానికి సాహసాలు చేయవద్దు..**

**- స్థానిక అధికారులు**

కలెక్టర్ ఆదేశాల మేరకు.. బుధవారం ఘటనా స్థలాన్ని సందర్శించిన స్థానిక అధికారులు వంతెన కూలిన అనంతరం ప్రమాదకరంగా ఉండడంతో ఈ రూటు గుండా వెళ్లొద్దని గ్రామస్తులు, రైతులకు ఎంపీడీవో లింబాద్రి, ఎంపీవో రహీం సూచించారు. అలర్ట్ చేయడానికి బ్రిడ్జి కూలిన చోట హెచ్చరిక గుర్తులు ఏర్పాటు చేశారు. మరమ్మతులకు ప్రతిపాదనలు పంపించామని, వంతెన దాటడానికి ప్రయత్నాలు చేయకుండా వంతెన మరమ్మతు అయ్యేంత వరకు వేరే దారి గుండా వెళ్లాలని కోరారు.

సమస్యపై ఎక్స్‌లో స్పందించిన నిర్మల్ కలెక్టర్

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

అధ్యాపకులతో మాట్లాడుతున్న సర్దార్ రవీందర్ సింగ్

ఉట్నూర్ రూరల్, నవంబర్ 20: రానున్న కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనను గెలిపిస్తే పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కరీంనగర్ మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్ అన్నారు. బుధవారం మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల, కళాశాలల్లో ఆయన పర్యటించారు. అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు రాజకీయంగా విద్యార్థి సంఘ నాయకుడిగా న్యాయవాదిగా, కార్పొరేటర్‌గా, మేయర్‌గా, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉందని అన్నారు. పట్టభద్రులైన నిరుద్యోగులకు ఉన్న సమస్యలపై పూర్తి స్థాయి అవగాహన ఉందని అన్నారు. తనను ఆదరించి పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిపించాలని విన్నవించారు. ప్రజా సమస్యలపై 24 గంటలు అందుబాటులో ఉంటానని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు ధరణి రాజేశ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

### పరిశుభ్రతతోనే ఆరోగ్యం

జైనథ్, నవంబర్ 20: వ్యక్తిగత పరిశుభ్రతతోనే ఆరోగ్యం లభిస్తుందని మండల వైద్యాధికారి నైనత అన్నారు. బుధవారం లక్ష్మీపూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో ఆరోగ్య పాఠశాల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, మాదక ద్రవ్యాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

ఉట్నూర్, నవంబర్ 20: అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఉట్నూర్ సీడీపీవో ఉమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఐసీడీఎస్ టీచర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత ప్రభుత్వం మహిళా, శిశువుల అభివృద్ధే లక్ష్యంగా దేశంలోని మిషన్ ఉత్కర్ష్ పథకంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు, పునరుత్పత్తి వయస్సు మహిళలకు, కౌమార బాలికలకు, చిన్న పిల్లలకు పౌష్టికాహారం మెరుగుపర్చడం అన్నారు. ఇందులో భాగంగా ఐసీడీఎస్ ఫ్రంట్‌లైన్ సిబ్బంది అయిన సూపర్‌వైజర్లు, టీచర్లు, హెల్పర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కావున సిబ్బంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది అబ్దుల్, పురుషోత్తం పాల్గొన్నారు.

### బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్ట్

అరెస్ట్ అయిన బీఆర్ఎస్ నాయకులు

ఇంద్రవెల్లి, నవంబర్ 20: కొడంగల్ లగచర్ల గ్రామానికి చెందిన గిరిజనులపై జరిగిన దాడికి నిరసనగా చలో లగచర్ల లంబాడా హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పిలుపునిచ్చిన నేపథ్యంలో మండలంలోని బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ఉదయమే ముందస్తు అరెస్ట్ చేసి, పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో జడ్పీ మాజీ కో-ఆప్షన్ సభ్యుడు మహ్మద్ అబ్దుల్ అష్మద్, బీఆర్ఎస్ మండల కో-ఆర్డినేటర్ షేక్ సుఫియాన్, మాజీ మండల కో-ఆప్షన్ సభ్యుడు మిర్జా జిలానీబేగ్, బీఆర్ఎస్ మండల నాయకులు కేంద్రే శ్యామ్ ఉన్నారు. అనంతరం వీరిని సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

## గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేస్తా

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఎదులాపురం, నవంబర్ 20: గ్రంథాలయ వారోత్సవాలు ఆదిలాబాద్‌లోని జిల్లా గ్రంథాలయంలో బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయల్ శంకర్ హాజరయ్యారు. ముందుగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం వివిధ పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో లైబ్రరీ శ్రీనివాస్, అశోక్ రెడ్డి, రమేశ్, ముకుంద్, సుభాష్ పాల్గొన్నారు.

### సోయా కొనుగోలు నిలిపివేత

బోథ్, నవంబర్ 20 : బోథ్ మార్కెట్ యార్డులో మార్క్ ఫెడ్ సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సోయా కొనుగోలును తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు కేంద్ర ఇన్‌చార్జి గోలి స్వామి తెలిపారు. కాంటాలు చేసినటువంటి బస్తాలు పెద్ద మొత్తంలో నిల్వ ఉండడం మూలంగా రెండు రోజుల పాటు కొనుగోలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. గురువారం వరకు కొనుగోలు ఉండవని తెలిపారు. కాంటాలు వేసిన బస్తాలు లారీలో తరలించిన అనంతరం కొనుగోలు తిరిగి ప్రారంభిస్తామని పేర్కొన్నారు. రైతులు సహకరించాలని కోరారు.

### ప్రజా సమస్యలు పరిష్కరించాలి

బోథ్, నవంబర్ 20 : రాష్ట్రంలో 90 శాతానికి పైగా ఉన్న పేద, మధ్య తరగతి వర్గాలైన బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ ప్రజల సమస్యలు పరిష్కరించాలని ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్‌కు వినతి పత్రం అందజేశారు. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య అందించాలని, ఉపాధి అవకాశాలు కల్పించి ఆర్థిక పరిస్థితిని మెరుగు పర్చాలని, అర్హులందరికీ సాగునీటి సౌకర్యంతో ఎకరం భూమి పంపిణీ చేయాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ధర్మ సమాజ్ పార్టీ బోథ్ మండలాధ్యక్షుడు గణేశ్, ఉపాధ్యక్షులు సుధాకర్, ప్రవీణ్, ప్రధాన కార్యదర్శి రమేశ్, కార్యదర్శి రాథోడ్ నరేందర్, రాజేశ్వర్, స్వామి, సాయి ఉన్నారు.

### జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విజయ విద్యార్థులు

నిర్మల్ అర్బన్, నవంబర్ 20: నిర్మల్‌లో 68వ రాష్ట్ర స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన బేస్ బాల్ రాష్ట్ర స్థాయి అండర్-17 బాలబాలికల పోటీల్లో విజయ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రన్నర్‌గా నిలిచి సిల్వర్ మెడల్ అందుకుని జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ నాగభూషణం తెలిపారు. పాఠశాలకు చెందిన శ్రీనిత్, ఉజ్జ్వల్, సహస్ర జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వీరిని బుధవారం పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సామ మోహన్ రెడ్డి, పీఈటీలు కృష్ణవేణి, గిరి ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### చుక్కా రామయ్యను ఆదర్శంగా తీసుకోవాలి

కేక్ కట్ చేస్తున్న వాసవి యాజమాన్యం

నిర్మల్ అర్బన్, నవంబర్ 20 : చుక్కా రామయ్య జీవితాన్ని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని వాసవి పాఠశాల కరస్పాండెంట్ పోతారెడ్డి, సెక్రటరీ జగదీశ్ రెడ్డి అన్నారు. బుధవారం నిర్మల్‌లోని వాసవి కిడ్స్, ఒలింపియాడ్, హైస్కూల్, వరల్డ్ పాఠశాలలో చుక్కా రామయ్య 98వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం గణితానికి సంబంధించిన వివిధ వస్తు సామగ్రిని తయారు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అడ్వాయిజర్ మోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### నిర్మల్ డీఈవోగా రామారావు

బాధ్యతలు స్వీకరిస్తున్న డీఈవో రామారావు

నిర్మల్ అర్బన్, నవంబర్ 20 :నిర్మల్ జిల్లా విద్యాశాఖ అధికారిగా రామారావు బుధవారం కలెక్టరేట్‌లోని డీఈవో కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వర్తించిన రవీందర్ రెడ్డి బదిలీపై మహబూబ్‌నగర్‌కు వెళ్లారు. రామారావు భద్రాద్రి కొత్తగూడెం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈవోను విద్యాశాఖ కార్యాలయ అధికారులు, ఉపాధ్యాయ సంఘ నేతలు, సిబ్బంది ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ సిద్ధ పద్మ, సెక్టోరియల్ అధికారి కరుణ పాల్గొన్నారు.

### స్వాతిప్రియ మృతికి సంతాపం

బాసర, నవంబర్ 20 : బాసర ట్రిపుల్ఐటీలో విద్యార్థిని స్వాతిప్రియ ఆత్మ హత్య ఘటనకు ట్రిపుల్ఐటీ టీఎస్ఏఎస్(తెలంగాణ స్టూడెంట్స్ అసోసియేషన్ ఫర్ సాలిడారిటీ) సంతాపం తెలియజేస్తున్నట్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రిపుల్ఐటీ విశ్వవిద్యాలయ శ్రేయస్సు, అభివృద్ధికి తమ మద్దతు ఉంటుందని కొన్ని యూట్యూబ్ ఛానల్‌లలో స్వాతి ప్రియ ఘటన గురించి తప్పుడు సమాచారాలు అందిస్తున్నారని వాటిని వెంటనే తొలగించి అధికారికంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి సంఘాలు ఒపిక పట్టి ఉద్రిక్తతను పెంచుకోకుండా ఉండాలన్నారు. యూనివర్సిటీ ప్రతిష్టను దెబ్బతీయకుండా విద్యార్థుల అభివృద్ధి కోసం కృషి చేయాలని అన్నారు. ట్రిపుల్ ఐటీ ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్ ఫ్యాకల్టీతో అభివృద్ధి కోసం తాము ఎప్పుడు దృఢంగా నిలబడుతామన్నారు.

### ప్రాసీడింగ్ అందజేత

కుభీర్, నవంబర్ 20 : మాలేగాం నుంచి గోడ్సర వరకు రోడ్డు నిర్మాణం కోసం గ్రావెల్ వేసేందుకు రూ.2.50 లక్షల ప్రొసీడింగ్ కాపీని ముథోల్ మాజీ ఎమ్మెల్యే గడ్డిగారి విఠల్‌రెడ్డి తన నివాసంలో బుధవారం గ్రామస్తులకు అందజేశారు. అలాగే డోడర్నతండా-1కి చెందిన చౌహాన్ సతీశ్‌కు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60వేల చెక్కును అందజేశారు.

## రైతుల సమస్యలు పరిష్కరిస్తా..

తాంసి, నవంబర్ 20 : పొన్నారి గ్రామ రైతుల సమస్యను త్వరలో పరిష్కరిస్తానని నాందేడ్ డివిజన్ సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డ్ మెంబర్ ఉష్కం రఘుపతి అన్నారు. బుధవారం పొన్నారి గ్రామంలోని రైల్వే గేట్‌ను నాయకులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 300 మంది రైతులు తమ పంట చేనుకు వెళ్లే దారిలో రైల్వే శాఖ అధికారులు కంచె ఏర్పాటు చేయడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తన దృష్టికి రావడంతో వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ మేరకు నాందేడ్ డివిజన్‌లోని ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి బ్రిడ్జి నిర్మాణ పనుల పురోగతి, ఇతర సమస్యలు త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం గ్రామ పంచాయతీలో నూతనంగా ఎన్నికైన రైల్వే బోర్డు మెంబర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో పొన్నారి మాజీ సర్పంచ్ అండె అశోక్, మాజీ వైస్ ఎంపీపీ రేఖ రఘు, నాయకులు సాయినాథ్, గంగన్న, రాంరెడ్డి, పండరి, రైతులు పాల్గొన్నారు.

## కారు అద్దాలు పగలగొట్టి డబ్బులు చోరీ

ఖైసా, నవంబర్ 20 : ఖైసాలోని బస్టాండ్ పక్కన గల ఎస్‌బీఐ ముందు ఆగి ఉన్న కారు అద్దాలు పగలగొట్టి రూ.లక్ష 80 వేలను చోరీ చేసిన ఘటన బుధవారం సాయంత్రం చోటు చేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. లోకేశ్వరం మండలం గడ్‌చాంద గ్రామానికి చెందిన అల్లం భోజన్న బీడీ కంపెనీ నిర్వహిస్తుంటాడు. కార్మికులకు బట్వాడ నిమిత్తం రూ. లక్ష 80 వేల నగదును కారులో తీసుకువచ్చాడు. ఎస్‌బీఐ బస్టాండ్ బ్రాంచ్ వద్ద కారు నిలిపి పని నిమిత్తం బ్యాంకులోకి వెళ్లగా కొద్ది సేపటికే బయటకు వచ్చి చూశాడు. కారు అద్దం పగలగొట్టి ఉండడంతో కారులో నగదు బ్యాగు కోసం చూడగా కనిపించకపోవడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని వివరాలు సేకరిస్తున్నారు.

## ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నిర్మల్ అర్బన్, నవంబర్ 20 : పుస్తక పఠనంతోనే జ్ఞానాన్ని పెంచుకోవచ్చని, ఉద్యోగార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అన్నారు. నిర్మల్‌లోని జిల్లా గ్రంథాలయంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. వారం రోజుల పాటు నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జున్‌మండ్ అలీ, మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

### టిప్పర్ బోల్తా : డ్రైవర్‌కు గాయాలు

అదుపు తప్పి బోల్తా పడిన టిప్పర్

ఇచ్చోడ, నవంబర్ 20: ఇచ్చోడ మండలంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఉపయోగించే కంకరను గుడిహత్నూర్ నుంచి ఇచ్చోడకు వైపు తరలిస్తున్న సోమా కంపెనీకి చెందిన టిప్పర్ వాహనం జాతీయ రహదారిపై అదుపు తప్పి బోల్తా పడింది. ఈ విషయం తెలుసుకున్న పోలీస్ సిబ్బంది, హైవే పెట్రోల్ సిబ్బంది అక్కడికి చేరుకొని క్రేన్, జేసీబీ సహాయంతో ఇచ్చోడ సీఐ భీమేశ్, ఎస్ఐ తిరుపతి పర్యవేక్షణలో కేబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ దినేశ్‌ను బయటకు తీశారు. ఈ ప్రమాదంలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయపడ్డాడు. క్షతగాత్రుడిని రిమ్స్‌కు తరలించారు.

### జిల్లా వాసికి డాక్టరేట్



డాక్టరేట్‌ను అందుకుంటున్న ప్రకాశ్‌రావు

సోన్, నవంబర్ 20 : నిర్మల్ మండలం మేడిపెల్లి గ్రామానికి చెందిన పొనుగొటి ప్రకాశ్‌రావుకు వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరామెంట్ ప్రొడక్షన్ కమిషన్ డాక్టరేట్ అవార్డుకు ఎంపిక చేసింది. బుధవారం న్యూఢిల్లీలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రకాశ్‌రావుకు డాక్టరేట్ పురస్కారాన్ని ప్రముఖ నటులు రామాయణం సీరియల్‌లోని హనుమాన్ పాత్రధారి బిందుధారాసింగ్ అందజేశారు. ఆయన రాష్ట్రంలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో సామాజిక సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద ప్రజలకు ఆర్థికంగా చేయూతను అందిస్తూ వారి జీవనోపాధికి తోడ్పడుతున్నారు. మరోవైపు సామాజిక దూరచరాలు, మాదకద్రవ్యాల వినియోగంపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు కల్పిస్తున్నారు. ప్రకాశ్‌రావు చేస్తున్న సామాజిక సేవ కార్యక్రమాలను గుర్తించి ఆయనను డాక్టరేట్ పురస్కారం అందజేసింది. జిల్లాకు చెందిన పలు సామాజిక సాంస్కృతిక సంస్థల బాధ్యులు అభినందనలు తెలిపారు.

### అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

బాసర, నవంబర్ 20 : బాసర సరస్వతీ అమ్మవారిని బుధవారం ప్రముఖులు దర్శించుకున్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ గంప నాగేశ్వర్‌రావు అమ్మవారిని దర్శించుకొని ఆయన మనుమరాలు ఝాన్సికకు అక్షరాభ్యాసం చేయించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. అదే విధంగా జిల్లా విద్యాశాఖ నూతన అధికారి పీ రామారావు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వీరిని అధికారులు ఘన స్వాగతం పలికారు.

### ఆదాయ పన్ను శాఖాధికారికి ఫిర్యాదు

ఎదులాపురం, నవంబర్ 20 : ఆదిలాబాద్‌లోని పాత జాతీయ రహదారి పక్కన ఉన్న ప్రైవేట్ దవాఖానలో వైద్యం కోసం వచ్చిన వారి నుంచి రూ.వేల ఫీజును వైద్యం పేరుతో దండుకుంటు బాధితులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆదిలాబాద్ యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేశ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆదాయ పన్ను శాఖాధికారి దుర్గం పార్థసారథిని కలిసి ఫిర్యాదు చేశారు. ఆస్తులపై ప్రభుత్వానికి సరైన విధంగా పన్ను చెల్లిస్తున్నారో లేదో ఆదాయ పన్ను శాఖాధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని సామ రూపేశ్ రెడ్డి కోరారు. కలిసిన వారిలో చేనేత జిల్లా అధ్యక్షుడు ఉదయ్ కిరణ్, యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాగరాజు, రంజిత్ రెడ్డి, జీవన్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-338964-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన

నమస్తే తెలంగాణ

క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679

ఖైరతీ: 91827 77671, 91827 77677

## తప్పులు లేకుండా సర్వే చేపట్టాలి

బేల, నవంబర్ 20 : సామాజిక సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా కొనసాగుతున్నదని ఆదిలాబాద్ అదనపు కలెక్టర్ శ్యామలా దేవి అన్నారు. బుధవారం బేలలో సమగ్ర కుటుంబ సర్వే నమోదు ప్రక్రియను తహసీల్దార్ రఘునాథ్‌రావ్‌తో కలిసి ఆమె పరిశీలించారు. ఎన్యుమరేటర్లు చేపడుతున్న సర్వేను పరిశీలించి కుటుంబ సభ్యులు చెప్పే వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలని సూచించారు. ఇప్పటి వరకు జరిగిన సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే కాలనీ వాసులు తమ వార్డుల్లో డ్రైనేజీ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామని అదనపు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. తప్పకుండా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం బేలలోని సబ్ మార్కెట్ యార్డులో సోయా కొనుగోలును పరిశీలించి రైతులతో మాట్లాడారు. సోయా కొనుగోలులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని సొసైటీ సిబ్బందికి సూచించారు. ఆమె వెంట సిబ్బంది ఉన్నారు.

బేల, నవంబర్ 20 : మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న సమగ్ర కుటుంబ సర్వేను ఎంపీడీవో మహేందర్ కుమార్ పరిశీలించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

తాంసి, నవంబర్ 20: ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను త్వరలో పూర్తి చేస్తామని ఎంపీడీవో మోహన్ రెడ్డి అన్నారు. అంబుగామ, గిరిగామ గ్రామాల్లో చేపడుతున్న సర్వేను పరిశీలించారు. బుధవారం నాటికి 5350 ఇండ్లకు గాను 4376 ఇండ్ల సర్వే పూర్తయిందని తెలిపారు. ఆయన వెంట ఎన్యుమరేటర్లు